క్లుప్తంగా

దూబగుంటలో 104 వైద్యసేవలు



కలిగిరి: మండలంలోని తూర్పుదూబగుంటలో 104 వాహనం ద్వారా ప్రజలకు 'ఫ్యామిలీ డాక్టర్' వైద్యసేవలను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మస్తాన్‌బాషా మాట్లాడుతూ 104 వాహనంలో సాధారణ వ్యాధులతోపాటు దీర్ఘకాలిక వ్యాధులకు మందులు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు ఫ్యామిలీ డాక్టర్ వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పలువురికి వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో 104 వాహన సిబ్బంది, స్థానిక వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

శ్యామలాదేవికి విశేష పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

వింజమూరు(ఉదయగిరి): స్థానిక ప్రసన్ననగర్‌లో శ్రీహరిహర పుత్ర అయ్యప్పస్వామి ఆలయంలో శ్యామలాదేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం ఆరో రోజు అమ్మవారు ఉచ్ఛిష్టి చండాలిని అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. వేదపండితులు అమ్మవారికి హోమాలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు వింజమూరు పట్టణంలోని భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు.

మేకపాటి పరామర్శ

వరికుంటపాడు: మండలంలోని విరువూరు ఎంపీటీసీ మాజీ సభ్యుడు సోడా ఫకీర్‌రెడ్డి గత నెల 30న అనారోగ్యంతో మృతిచెందారు. గురువారం ఆయన ఉత్తరక్రియల సందర్భంగా వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ఆ గ్రామానికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఫకీర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ ఫకీర్‌రెడ్డి పార్టీ బలోపేతానికి ఎంతో కృషి చేశారని, వారి కుటుంబానికి వైఎస్సార్‌సీపీ అండగా నిలుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ అలీఅహ్మద్, నాయకులు తిరుపతినాయుడు, మాగంటి శ్రీనివాసులు, దాసరి యర్రా ఓబయ్య, యు.వెంకట సుబ్బారెడ్డి, ఎం.శ్రీనివాసులు, బి.వెంకటరత్నం, జాజం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ

కొండాపురం: స్థానిక పోలీస్‌స్టేషన్‌ను కలిగిరి సీఐ షేక్ ఫిరోజ్ గురువారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను ఎస్సై షేక్ ఖాజావలిని అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎస్సైకి సూచించారు.

దరఖాస్తుల స్వీకరణ

కలిగిరి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో 2024 సంవత్సరానికి సంబంధించి వేలం నిర్వహణలో సీజనల్ క్లర్క్‌గా పనిచేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వేలం నిర్వహణాధికారి వి.మహేష్‌కుమార్ గురువారం తెలిపారు. డిగ్రీ పూర్తి చేసిన యువతీ యువకులు ఈ నెల 28వ తేదీ లోపు స్థానిక వేలం కేంద్రంలో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

భూఆక్రమణపై ఫిర్యాదు

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండలం ఊటుకూరు గ్రామానికి చెందిన గంజిబోయిన చిన్నారావు తన భూమిని అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఆక్రమించి తనను ఇబ్బంది పెడుతున్నాడని గురువారం తహసీల్దార్ ఎంవీ కృష్ణారెడ్డికి ఫిర్యాదు చేశాడు. ఈ విషయమై గత ఆర్నెల్ల నుంచి తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా న్యాయం జరగలేదని వాపోయాడు. తనకు న్యాయం జరగకపోతే ఆత్మహత్యే శరణ్యమని ఆవేదన వ్యక్తం చేశాడు.

మోటారు సైకిల్ చోరీ

ఆత్మకూరు: ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని ఏఎస్‌పేట అడ్డరోడ్డు ఎదురుగా ఉన్న పెట్రోల్ బంకు వద్ద పార్కు చేసి ఉన్న మోటారు బైక్‌ను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారని బాధిత రైతు హర్షవర్ధన్‌రెడ్డి గురువారం ఆత్మకూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలు.. రెలిచిన పొగాకును బ్యారన్లకు ట్రాక్టర్ ద్వారా తరలించే క్రమంలో తన మోటారు బైక్‌ను వారం రోజుల క్రితం పెట్రోల్ బంకు వద్ద రైతు హర్షవర్ధన్‌రెడ్డి పార్క్ చేశారు. పనులు పూర్తయిన అనంతరం రెండు రోజుల క్రితం పెట్రోల్ బంకు వద్దకు వెళ్లి చూడగా మోటారు బైక్ కనిపించకపోవడంతో అపహరణకు గురైనట్లు గుర్తించారు. పలుచోట్ల గాలించినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

• ఆత్మకూరు ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి



చేజర్ల: నిర్మాణం పూర్తయిన ఆలయ ప్రహరీ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

చేజర్ల: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ముందుకుసాగుతోందని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి తెలిపారు. ఆయన గురువారం చేజర్ల మండలం ఆదూరుపల్లిలో విజయీభవ యాత్ర నిర్వహించారు. గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డికి మహిళలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలో పూర్తయిన పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మేనిఫెస్టోలో చెప్పిన ప్రతి హామీని నెరవేర్చిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. ఇప్పటి వరకు ఆదూరుపల్లి పంచాయతీకి ప్రభుత్వం రూ.16.19 కోట్ల నిధులు అందజేసిందని తెలిపారు. పేదల సొంతింటి కలను సాకారం చేస్తూ జగనన్న లేఅవుట్‌లో గ్రామంలోని 65 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు మంజూరు చేసిందని తెలిపారు. సొంత స్థలం కలిగిన లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం నిధులు అందజేసిందని తెలిపారు. గ్రామంలోని విద్యార్థులకు 225 ట్యాబ్‌లు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఆదూరుపల్లిలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా రూ.79 లక్షలు, జెడ్పీ నిధులు రూ.10 లక్షలు అభివృద్ధి పనులకు మంజూరయ్యాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కొమ్మి సిద్ధులనాయుడు, బి.సుధాకర్‌రెడ్డి, పి.రామమనోహర్‌రెడ్డి, పార్టీ ప్రచార కమిటీ కార్యదర్శి ఎర్రగుంట పెంచలయ్య, జిల్లా యూత్ విభాగం నాయకుడు షేక్ మహమ్మద్ రఫీ, నాయకులు నోటి సుందరరామిరెడ్డి, యు.రఘురామిరెడ్డి, శేఖర్‌రెడ్డి, రాంబాబు, చిరంజీవిరెడ్డి ఎంపీడీఓ ఎస్.కరిముల్లా, డీటీ విజయ్, పంచాయతీ సెక్రటరీ అచ్చి అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమావేశం

మర్రిపాడు: మండలంలోని బ్రాహ్మణపల్లిలో బూథవాడకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులతో గురువారం ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమష్టి భాగస్వామ్యంతో గ్రామాలను అభివృద్ధి చేసుకుందామని, పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. గ్రామానికి అవసరమైన అభివృద్ధి పనులు, మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించాలని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సిద్దారెడ్డి, లక్ష్మీరెడ్డి, కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, రామకృష్ణ, సాయి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత



చేజర్ల: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని చేజర్ల పీహెచ్‌సీ డాక్టర్ గిరీష్ పేర్కొన్నారు. మండలంలోని ఓబులాయపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమాన్ని నిర్వహించారు. రోగులకు బీపీ, షుగర్, రక్త పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ గిరీష్ మాట్లాడుతూ వాతావరణంలో మార్పుల కారణంగా ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. ఆకుకూరలు, పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్యంగా ఉండాలని తెలిపారు. 45 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఐదుగురు గర్భిణులను పరీక్షించి మందులు అందజేసారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ చంద్రయ్య, ఎంఎల్‌హెచ్‌పీ రేవతి, ఏఎన్‌ఎం మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలు



పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

వరికుంటపాడు: మండల కేంద్రం వరికుంటపాడులో నూతనంగా నిర్మించిన శ్రీపద్మావతి గోదాదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు పెండ్యాల సూర్యనారాయణ – అమ్మాజీ దంపతుల ఆధ్వర్యంలో వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం గోపూజ, వాసుదేవ పుణ్యాహవచనం, రక్షాబంధనం, వాస్తు పూజ, వాస్తుహోమం తదితర పూజా కార్యక్రమాలు జరిగాయి. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. ఉత్సవాల సందర్భంగా ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. సాయంత్రం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ల ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయండి



సచివాలయ ఉద్యోగులకు సూచనలిస్తున్న తహసీల్దార్, ఎంపీడీఓ

అనుమసముద్రంపేట: ప్రభుత్వం పేదలకు అందజేస్తున్న జగనన్న గృహాల రిజిస్ట్రేషన్ల ప్రక్రియను త్వరితగతిన పూర్తిచేయాలని తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు సూచించారు. గురువారం మండలంలోని ఏఎస్‌పేట బిట్-1, 2, చిరమన సచివాలయాలను వారు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయ ఉద్యోగులతో వారు మాట్లాడుతూ గృహాల రిజిస్ట్రేషన్లను వెంటనే పూర్తి చేయాలని తెలిపారు. లబ్ధిదారులకు ప్రభుత్వం ఒక్క రూపాయి ఖర్చు లేకుండానే రిజిస్ట్రేషన్లు చేయిస్తోందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

డీవీఎంసీ ముసుగులో అక్రమ వసూళ్లు

• మాజీ సభ్యుడిపై కేసు నమోదు

ఆత్మకూరు: అన్యాయానికి గురవుతున్న దళితుల సమస్యలను గుర్తించి పరిష్కారం దిశగా చర్యలు తీసుకొనేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ పదవిని దుర్వినియోగం చేస్తూ అక్రమ వసూళ్లకు పాల్పడిన అప్పటి సభ్యుడు రసూల్‌పై బాధిత హెచ్‌ఎం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైన విషయం తెలిసిందే. అయితే ఇతనిపై కేసు నమోదైన అనంతరం పలు అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. ఏఎస్‌పేట మండలంలోని ఓ గ్రామానికి చెందిన రసూల్ గత కొన్నేళ్లుగా ఆత్మకూరు పట్టణంలో నివాసం ఉంటున్నాడు. మూడేళ్ల క్రితం విజిలెన్స్ మానిటరింగ్ కమిటీలో సభ్యుడిగా వ్యవహరించాడు. అదే అదునుగా పలువురిని బెదిరించి అక్రమంగా వసూళ్లకు పాల్పడ్డాడు. ఆత్మకూరు పట్టణంతోపాటు డివిజన్ పరిధిలోని పలు హాస్టళ్లు, గురుకుల పాఠశాలల్లో తనిఖీల పేరుతో రసూల్ ఒక్కడే వెళ్లి ఏవైనా చిన్న చిన్న పొరపాట్లను పెద్దవిగా చూపి హాస్టళ్లు, గురుకుల పాఠశాలల నిర్వాహకులను బెదిరించేవాడు. అనంతరం అతని సహాయకుడు, యూట్యూబ్ విలేకరినని చెప్పుకొనే నిహాల్‌ను ఆయా హాస్టళ్లకు, పాఠశాలలకు పంపేవాడు. మీ మీద రసూల్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తే మీరు సస్పెండ్ అవుతారని, ఎలాగోలా అతనిని మంచి చేసుకోవాలని నిహాల్ వారికి చెప్పేవాడు. దీంతో వారు అతనికి ఎంతో కొంత నగదు ఇస్తుండేవారని సమాచారం. ఈ క్రమంలో ఓ ప్రైవేట్ బ్యాంకులో చిరుద్యోగిగా పనిచేస్తున్న షేక్ బాదుల్లా అనే యువకుడి వద్ద ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని రసూల్ రూ.60 వేలు వసూలు చేశాడని బాధితుడు వాపోయాడు. అలాగే గతేడాది స్థానిక జెడ్పీ బాలికల పాఠశాలలో నాడు–నేడు కార్యక్రమం ద్వారా నిర్మిస్తున్న భవనాలకు సంబంధించి హెచ్‌ఎం శ్రీనివాసులను రసూల్ పలు విధాలుగా బెదిరించి పనుల్లో నాణ్యతలేదని, ఒక వర్గానికే మద్దతుగా ఉన్నాడంటూ అతని వద్ద రూ.3.50 లక్షలు వసూలు చేశాడు. అంతేకాక రసూల్ వద్ద హెచ్‌ఎం అప్పు తీసుకున్నట్లు పత్రం సైతం రాయించి సంతకాలు చేయించుకున్నాడు. ఇటీవల సంక్షేమ హాస్టళ్ల సిబ్బందిని కొందరు విలేకర్లు, డీవీఎంసీ సభ్యుల ముసుగులో నగదు ఇవ్వాలని, లేకపోతే హాస్టల్ అవకతవకలపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని బెదిరించడంతో ఏఎస్‌డబ్ల్యూఓ చల్లా శ్రీదేవి, డీఎస్పీ కోటారెడ్డికి హాస్టల్ సిబ్బందితో కలిసి వెళ్లి ఫిర్యాదు చేసింది. ఈ నేపథ్యంలో తనను బెదిరించి డబ్బులు నగదు వసూలు చేసిన రసూల్‌పై బదిలీపై వెళ్లిన బాధిత హెచ్‌ఎం శ్రీనివాసులు డీఎస్పీకి రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఇది జరిగి రెండు నెలలైనా పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ఆయన జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాలతో ఆత్మకూరు పోలీసులు రసూల్‌తోపాటు అతని సహాయకుడు నిహాల్‌పై బుధవారం కేసు నమోదు చేశారు. ఇలా రసూల్ అక్రమాలకు సంబంధించి ఎస్సై ఎం.ముత్యాలరావును వివరణ కోరగా, వారిపై నాన్ బెయిలబుల్ కేసు నమోదు చేశామని, పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తామని తెలిపారు.

వధూవరులకు ఆశీస్సులు

వింజమూరు(ఉదయగిరి): వింజమూరులోని ఎస్‌వీ కల్యాణ మండపంలో బుధవారం రాత్రి జరిగిన విశ్రాంత డీఎంహెచ్‌ఓ మాశిలామణి కుమారుడు ప్రశాంత్–స్నేహల వివాహ వేడుకల్లో పలువురు ప్రముఖులు పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు గణపం బాలకృష్ణారెడ్డి, కృష్ణకిరణ్, సొసైటీ చైర్మన్ విజయకుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రేవునూరు శ్రీనివాసులురెడ్డి, జిల్లా సహకార బ్యాంక్ డైరెక్టర్ లక్ష్మీప్రసాద్‌రెడ్డి తదితరులు ఈ వివాహ వేడుకలో పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు.

సరస్వతీదేవికి ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న విద్యార్థినులు

సంగం: వసంత పంచమిని పురస్కరించుకుని స్థానిక బీసీ బాలికల వసతి గృహంలో వార్డెన్ మల్లీశ్వరి ఆధ్వర్యంలో సరస్వతీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థినులు మార్చిలో జరగనున్న 10వ తరగతి పరీక్షలు బాగా రాసి ఉత్తమ మార్కులు సాధించాలని సూచించారు. అనంతరం విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

బంద్‌ను జయప్రదం చేయండి

ఆత్మకూరు: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతుల, కార్మికుల వ్యతిరేక విధానాలకు నిరసనగా శుక్రవారం జరగనున్న దేశవ్యాప్త గ్రామీణ భారత్ బంద్‌లో అన్నివర్గాల ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని సీపీఎం, రైతు కూలీ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని అల్లీపురం, పేరారెడ్డిపల్లి గ్రామాల్లో గురువారం రైతులతో సమావేశమై బంద్ విషయంపై వారికి అవగాహన కల్పించారు.

మర్రిపాడు: కేంద్ర ప్రభుత్వ రైతాంగ, ప్రజా వ్యతిరేక చర్యలను నిరసిస్తూ మర్రిపాడు మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించే భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి బత్తల రత్తయ్య పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం మర్రిపాడులో కరపత్రాలను పంపిణీ చేశారు.

జీవవైవిధ్యం - సంరక్షణపై అవగాహన



మాట్లాడుతున్న ఎంపీడీఓ ఈశ్వరమ్మ

ఉదయగిరి: పట్టణంలోని స్త్రీశక్తి భవనంలో గురువారం ఫర్డ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో జీవవైవిధ్యం – సంరక్షణపై సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ డి.ఈశ్వరమ్మ మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో జీవవైవిధ్య సదస్సులు నిర్వహించాలని, ప్రతి నెలా గ్రామాల్లో బీఎంసీ కమిటీల సమావేశం ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే ప్రతి పంచాయతీలో ఆఫీసు బోర్డు, అవసరమైన వస్తుసామగ్రి ఏర్పాటు చేయాలన్నారు. ఫర్డ్స్ డైరెక్టర్ పీవీ రమణయ్య మాట్లాడుతూ జీవవైవిధ్య రిజిస్టర్లు పంచాయతీలో తయారు చేసేలా చూడాలని, మండల కమిటీలను ఏర్పాటు చేయించాలని తెలిపారు.

వైఎస్ జగన్‌ను మళ్లీ సీఎంగా చేసుకుందాం



కాలనీవాసుల సమస్యలు తెలుసుకుంటున్న మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

• మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

ఉదయగిరి: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ఓటు వేసి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందామని ఆ పార్టీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆయన గురువారం పట్టణంలోని బీసీకాలనీ, స్టేట్‌పేట, ఎస్టీకాలనీలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆయా కాలనీల ప్రజలతో మమేకమై వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పలువురు తమ కాలనీలో తాగునీరు, డ్రైనేజీ సమస్యలు ఉన్నాయని ఆయన దృష్టికి తెచ్చారు. స్పందించిన మేకపాటి 15 రోజుల్లోపు తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని వారికి హామీ ఇచ్చారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్నివర్గాల వారికి పార్టీలకతీతంగా సమన్యాయం జరుగుతుందన్నారు. రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలన్నా, సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. ప్రజల సమస్యలను నాయకులు స్వయంగా తెలుసుకునేందుకు ముఖ్యమంత్రి రచ్చబండ కార్యక్రమం ఏర్పాటు చేశారని తెలిపారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోలేని ఎన్నో సమస్యలు ఈ కార్యక్రమం ద్వారా తన దృష్టికి వస్తున్నాయన్నారు. తాము వెంటనే అక్కడికక్కడే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జి.ఓబుల్‌రెడ్డి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు గాజుల తాజుద్దీన్, జేసీఎస్ కన్వీనర్ కల్లూరి కృష్ణారెడ్డి, నాయకులు అశోక్, మౌలాలి, బికారి, బాబు, పోలయ్య, సామ్రాట్, కల్లూరి వెంకటేశ్వర్లురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంలపై అవగాహన



ఈవీఎంలపై అవగాహన కల్పిస్తున్న ఏఓ వెంకటేశ్వరరావు

అల్లూరు: ఓటర్లు ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ల (ఈవీఎం)పై అవగాహన కలిగి ఉండాలని ఏఓ వెంకటేశ్వరరావు తెలిపారు. ఈవీఎం ద్వారా ఓటు వేసే విధానంపై గురువారం అల్లూరు మండలంలోని ఇస్కపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ప్రతి ఓటరు ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్, కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్, వీవీ ప్యాట్ల గురించి తెలుసుకోవాలన్నారు. ఓటు వేసే విధానంపై క్షేత్రస్థాయిలో మొబైల్ వాహనాల ద్వారా ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు.

రామాలయ నిర్మాణానికి సహకరిస్తాం



పూజల్లో పాల్గొన్న రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

• ఎంపీ బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: కావలి రూరల్ మండలం చలంచర్ల గ్రామంలో రామాలయ నిర్మాణానికి తిరుమల తిరుపతి దేవస్థానం నిధులు రూ.10 లక్షలు మంజూరు చేయిస్తామని, అలాగే ఆలయ నిర్మాణానికి వ్యక్తిగతంగా కూడా సహకరిస్తామని రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, స్థానిక ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి గ్రామస్తులకు తెలిపారు. మండలంలోని చలంచర్ల గ్రామంలో గ్రామస్తులు నిర్మించుకుంటున్న నూతన రామాలయ పూజా కార్యక్రమాల్లో రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి గురువారం పాల్గొని గ్రామస్తులతో మాట్లాడారు. గ్రామంలో నూతన రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించేందుకు అన్ని చర్యలు తీసుకున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ ఎంవీ కృష్ణారెడ్డి

వింజమూరు(ఉదయగిరి): రానున్న సార్వత్రిక ఎన్నికలకు ఓటరు జాబితా సిద్ధం చేసుకొని అందరూ సంసిద్ధులై ఉండాలని తహసీల్దార్ ఎంవీ కృష్ణారెడ్డి బీఎల్వోలకు సూచించారు. ఆయన స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం మండలంలోని బీఎల్వోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన ఓటర్ల చేర్పులు, మార్పులు, ఫాం-6, ఫాం-7, ఫాం-8 దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ చేవూరి శ్రీనివాసులు, సీనియర్ అసిస్టెంట్ సుధాకర్, వీఆర్వోలు, బీఎల్వోలు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

బీఎల్వోలతో సమావేశం

చేజర్ల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం తహసీల్దార్ గోపీకృష్ణ ఓటర్ల జాబితాపై బీఎల్వోలతో సమావేశం నిర్వహించారు. ఫాం-6, ఫాం-7, ఫాం-8లపై పెండింగ్‌లు లేకుండా చూసుకోవాలని సూచించారు. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ విజయ్, ఆర్ఐ సుమతి తదితరులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తను వేరు చేయండి



డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న కమిషనర్, సిబ్బంది

ఆత్మకూరు: ప్రజలు ఆత్మకూరు మున్సిపల్ పరిధిలో పారిశుద్ధ్య సిబ్బందికి తడి, పొడి చెత్తలను వేరుచేసి అందించాలని, అలాగే పారిశుద్ధ్య సిబ్బంది కూడా సేకరించిన చెత్తను డంపింగ్ యార్డులో విడివిడిగా డంప్ చేయాలని మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా సూచించారు. ఆత్మకూరు బైపాస్ రోడ్డులోని మున్సిపల్ డంపింగ్ యార్డును ఆయన సిబ్బందితో కలిసి గురువారం పరిశీలించారు. అక్కడ అస్తవ్యస్తంగా ఉన్న చెత్తను పరిశీలించి అప్పటికప్పుడే జేసీబీని పిలిపించి చెత్తను యార్డులోకి తరలించేలా చేశారు. చెత్తను ఇష్టారాజ్యంగా మరోసారి వేయరాదని సిబ్బందిని హెచ్చరించారు. చెత్త ద్వారా ఎరువును తయారు చేయించి రైతులకు విక్రయించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఆయన వెంట మున్సిపల్ జేఈ ప్రసాద్, ఆర్ఐ ఖాసీం తదితరులు ఉన్నారు.